రహదారిపై ఒరిగిన లారీ



పెదపాడు శివారు గండిచెరువుగట్టు వద్ద రహదారిపై వరిగిన లారీ

పెదపాడు: పెరికీడు–ఏలూరు రహదారిపై పెదపాడులో లారీ పక్కకు ఒరిగిపోయింది. శుక్రవారం తెల్లవారు జామున పెరికీడు వైపు నుంచి చేపల మేతతో ఏలూరు వైపునకు వెళ్తున్న లారీ పెదపాడు శివారు గండిచెరువు గట్టు వద్దకు వచ్చేసరికి ఎదురుగా మినీ వ్యాన్ రావడంతో లారీని పక్కకు పోనివ్వడంతో అక్కడికక్కడే ఒరిగిపోయింది. రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా రహదారి పక్కన గ్రావెల్ వేసి రోడ్డు రోలర్‌తో తొక్కించారు. వర్షాల కారణంగా బురదగా తయారవడంతో చక్రాలు దిగిపోయి లారీ ఒరిగింది. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సాయంత్రం క్రేన్ సహాయంతో లారీని బయటకు లాగారు.

పోలీసులకు ఆర్థిక భరోసా

- బకాయిల చెల్లింపుపై హర్షం
- ఉమ్మడి పశ్చిమలో 2,550 మంది పోలీసులకు లబ్ధి
- సుమారుగా రూ.8 కోట్లు విడుదల



ఏలూరు టౌన్: పోలీసులకు ఇవ్వాల్సిన అలవెన్సు బకాయిలు మంజూరు చేయటంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులకు జీతాల విషయంలో పెద్దగా ఇబ్బంది లేకున్నా.. అలవెన్సుల బకాయిలు పేరుకుపోయాయి. ఈ నేపథ్యంలో సర్కారు కీలక నిర్ణయం తీసుకోవడంతో పోలీసులకు ఆర్థిక భరోసా లభించింది. బకాయిల చెల్లింపులతో వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. పాలన గాడిలో పెట్టేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు చెల్లింపులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు.

పోలీసులకు ఊరట

ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో ఉమ్మడి పశ్చిమలో సుమారు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ స్థాయి నుంచి ఎస్ఐ, ఏఎస్ఐ, హెచ్‌సీ, కానిస్టేబుల్ వరకూ అలవెన్సుల బకాయిలు మంజూరవుతున్నాయి. సుమారు 11 నెలలుగా పేరుకుపోయిన ట్రావెలింగ్ అలవెన్సు బకాయిలు ఒకేసారి విడుదల చేయటంతో వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. హెచ్‌ఆర్‌ఏ, ఏపీజీఎల్ఐ, జీపీఎఫ్ రుణాలు సైతం మంజూరు చేయటంతో పోలీసులు సంతోషంగా ఉన్నారు. ఇక సరెండర్ లీవ్స్, అదనపు సరెండర్ లీవ్స్ బకాయిలు మాత్రం పెండింగ్‌లో ఉన్నాయని, అవి కూడా త్వరలోనే మంజూరు చేస్తారని అంటున్నారు.

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బందికి ప్రభుత్వం బకాయిలు విడుదల చేసింది. రెండు జిల్లాల్లోనూ సుమారు ఆయా బకాయిల చెల్లింపులు రూ.8 కోట్లకు పైగా ఉంటుందని చెబుతున్నారు. ఒక్క టీఏ అలవెన్సు బకాయిలు సుమారుగా రూ. 3.82 కోట్ల నుంచి రూ. 4.12 కోట్ల వరకూ ఉందని అధికారులు అంటున్నారు. వీటితోపాటు హెచ్‌ఆర్‌ఏ, ఇతర బకాయిలు చూస్తే రెండు జిల్లాలోనూ పోలీసుల శాఖకు రూ.8 కోట్ల వరకూ బకాయిలు చెల్లింపులు చేసినట్లు తెలుస్తోంది. ఏపీజీఎల్ఐ, జీపీఎఫ్ రుణాలు సైతం విడుదల కావటంతో వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పోలీస్ శాఖలో సీఐలు– 30 , సబ్ ఇన్స్‌పెక్టర్లు –120, ఏఎస్ఐ –150, హెడ్ కానిస్టేబుల్స్ – 450 , కానిస్టేబుల్స్ – 1850 మంది ఉన్నారు. మొత్తంగా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 2600 మంది వరకూ పోలీస్ సిబ్బంది ప్రజలకు సేవలు అందిస్తున్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ సీఎం జగన్‌కు వినతి



సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: తన నియోజకవర్గానికి ఇచ్చిన హామీల్లో చాలావరకూ నెరవేర్చినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు కృతజ్ఞతలు తెలుపుతూనే మిగిలిన హామీలను త్వరగా పూర్తి చేయాలని వినతిపత్రాన్ని సమర్పించారు. శుక్రవారం అసెంబ్లీ ఆవరణలో ముఖ్యమంత్రి జగన్‌కు కలిసిన వాసుబాబు వినతిపత్రాన్ని అందజేశారు. గతేడాది మే నెలలో గణపవరం వచ్చిన సందర్భంగా సభాముఖంగా ఇచ్చిన హామీల్లో ఏలూరు కాల్వపై గుండుగొలను, నారాయణపురం వద్ద వంతెనల నిర్మాణాలకు నిధులు మంజూరు, ఆగడాల లంకలో రూ.25 కోట్ల వ్యయంతో మంచినీటి స్టోరేజి ట్యాంకు నిర్మాణం, సరిపల్లెలో రూ.100 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి నిధుల మంజూరుపై ఆయన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. గణపవరం బొబ్బిలి వంతెన నిర్మాణానికి ఇచ్చిన హామీమేరకు నిధులు మంజూరు చేయించాలని, ఆక్వా జోన్‌తో సంబంధం లేకుండా పదెకరాలు ఉన్న రైతులకు విద్యుత్ సబ్సిడీని మంజూరు చేయాలని వాసుబాబు కోరారు. నియోజకవర్గంలోని ప్రధాన రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గంలో జలజీవన్ మిషన్ పథకంలో చేపట్టిన పనులను ముఖ్యమంత్రికి వివరించారు.

వడలమ్మ ఆలయ అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ సంకు పుల్లయ్య

నిడమర్రు: బువ్వనపల్లి గ్రామదేవత శ్రీ వడలమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆ ఆలయ అభివృద్ధి కమిటీ నూతన చైర్మన్, దాత సంకు పుల్లయ్య అన్నారు. శుక్రవారం ఇటీవల ఎన్నికైన వడలమ్మ అమ్మవారి నూతన కమిటీ తొలిసమావేశం ఆ ఆలయ ప్రాగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ సంకు పుల్లయ్య మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో రూ10 లక్షలతో షెడ్ నిర్మాణం పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మరో రూ3 లక్షలతో ఆలయ ప్రాంగణంలోని శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయం చుట్టు ప్రహారీ గోడ నిర్మాణంకు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పుప్పాల పుండరీ కాక్షుడు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, అభివృద్ధి కమిటీ సభ్యులు తోపు సూర్యచంద్రరావు, పంజా రాంబాబు, సంకు నాగమునీంద్రరావు, కోసూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్షయరహిత సమాజాన్ని స్థాపిద్దాం



భీమడోలులో ప్లకార్డులను ప్రదర్శిస్తున్న వైద్యులు బృందం

భీమడోలు: క్షయరహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ బాగస్వాములు కావాలని భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం సీనియర్ వైద్యాధికారి డాక్టర్ వి.రవిపాల్ అన్నారు. ప్రపంచ క్షయవ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం భీమడోలు సామాజిక కేంద్రంలోని టీబీ యూనిట్ సీనియర్ సూపర్‌వైజర్ మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో క్షయవ్యాధి నివారణ, నిర్మూలన తదితర అంశాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. రవిపాల్ మాట్లాడుతూ ఆరోగ్య సూత్రాలను పాటించడం ద్వారా క్షయ వ్యాధిని నిర్మూలించుకోవచ్చునన్నారు. అనంతరం 15మంది టీబీ రోగులకు భారత్ అభియాన్ పోషణ పథకం కింద దాతల సహకారంతో పోష్టికాహారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అల్బర్ట్, బి.లీలాప్రసాద్, జోషిరాయ్, కె.రష్మి, శ్రావణ్‌రెడ్డి, అరవింద, ఐసీటీసీ కౌన్సిలర్ సింహాద్రి, సిబ్బంది బాలిన పాపారావు పాల్గొన్నారు.

ఘనంగా రామాలయం పునఃప్రతిష్ఠా మహోత్సవం



కోదండ రామాలయం పునఃప్రతిష్ఠ పూజలు చేస్తున్న భక్తులు

పెదపాడు: స్థానిక సత్యనారాయణపురం కోదండ రామాలయంలో ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. 39 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ఆలయం శిథిలావస్థకు చేరడంతో పునఃనిర్మించారు. శుక్రవారం శిఖర పూజ, సుదర్శన హోమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో కిలారు రఘు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేసారు. ఆలయ అర్చకుడు వేదాంతం శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు. శనివారం చండీహోమం, అన్న సంతర్పణ నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

భీమడోలు: జాతీయ రహదారి కురెళ్లగూడెం శివారున శుక్రవారం తెల్లవారుజామున ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. భీమడోలు వైపుగా నడుస్తున్న వ్యక్తిని తాడేపల్లిగూడెం నుంచి ఏలూరు వైపుగా వెళ్తున్న వాహనం వెనుక నుంచి ఢీకొట్టినట్లు భావిస్తున్నారు. అతని వయసు 45 నుంచి 50 ఏళ్ల మధ్య ఉంటుందని, తెలుపు రంగు లుంగీ, చొక్కా ధరించి ఉన్నాడని, ఐదున్నర అడుగుల ఎత్తు ఉన్నాడని చెప్పారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్ట్‌మార్టమ్ నిమిత్తం తరలించినట్లు ఎస్సై చావా సురేష్‌కుమార్ తెలిపారు. ఆచూకీ తెలిస్తే 9440796652, 9154880255 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ

భీమడోలు: ఏప్రిల్ 5న వివిధ రైతు సంఘాల ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ ర్యాలీని విజయవంతం చేయాలని కౌలు రైతు సంఘం మండల కన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్ర మూర్తి అన్నారు. చలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పూళ్ల పంచాయతీ పరిధిలోని రెడ్డినాయుడుపేటలో కరపత్రాలను ఆవిష్కరించి పంపిణీ చేశారు. కార్యక్రమంలో అల్లు రంగారావు, అల్లు శ్రీను, నొచర్ల అప్పారావు, ఈదుపల్లి నాగేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి పశువులకు టీకాలు

వేలేరుపాడు: వేలేరుపాడు, కుక్కునూరు, జీలుగుమిల్లి, మండలాల్లో పాడి పశువులకు శనివారం నుంచి ఏప్రిల్ 24 వరకూ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లుఏడీఏ డాక్టర్ సాయిబుచ్చారావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

మంచినీటి చెరువుల్లో తగ్గిన నీటి మట్టం

భీమడోలు: కొల్లేరు ప్రాంత గ్రామాల్లోని మంచినీటి చెర్వుల నీటి మట్టాలు తగ్గి నీరు దుర్వాసన రావడంతో ఆయా గ్రామాల్లోని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఓ పక్క దాళ్వా సాగు జరుగుతుండడం, మరో పక్క వేసవి తీవ్రత రీత్యా మంచినీటి చెరువులు అడుగంటుతున్నాయి. దీనితో చెరువుల్లోని నీరు పచ్చరంగులోకి మారి ఎంతగా ఫిల్టర్ చేసి పంపిణీ చేసినా దుర్వాసన వస్తున్నాయి. బిందెల్లోకి పట్టిన నీరు పచ్చరంగులోనే ఉంటోందని మహిళలు అంటున్నారు. గుండుగొలను, లక్ష్మీపురం, వడ్డిగూడెం, రత్నాపురం, కొరుకల్లు, ఆగడాలలంక, చెట్టున్నపాడు గ్రామాల్లోని మంచినీటి చెరువుల్లో నీటి మట్టాలు పడిపోయాయి. నీటి దుర్వాసన అంశాన్ని ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులు దృష్టికి తీసుకుని వెళ్లారు. దీనిపై స్పందించిన అధికారులు కొల్లేరు ప్రాంత గ్రామాల్లోని చెరువుల్లో పటిక పొడి పిచికారీ చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో గుండుగొలనులో అధిక విస్తీర్ణంలో ఉన్న వింధ్యవాసిని చెరువులోని నీరు రంగు మారడంతో పంచాయతీ గ్రామ కార్యదర్శి మురళీ ముందుస్తుగా చెరువులో పటిక పొడి పిచికారీ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. దీని వల్ల నీటిలోని పచ్చరంగు తొలగి ఫిల్టర్ చేసేందుకు దోహదపడుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఏ.రామారావు తెలిపారు. గ్రామ పంచాయతీలు తమ పరిధిలోని చెరువుల్లో ఇలాంటి పనులను యుద్ధ ప్రాతిపదిక చేసుకోవాలని ఆయన సూచించారు.



గుండుగొలనులోని వింధ్యవాసిని చెరువులో పటిక పొడి చల్లుతున్న సిబ్బంది

ఆర్టీసీ బస్సును ఢీకొన్న డీసీఎం





బాలకృష్ణ మృతదేహం

క్యాబిన్‌లో ఇరుకున్న క్షతగాత్రులను బయటకు తీస్తున్న పోలీసులు

- డీసీఎం క్యాబిన్‌లో ఇరుక్కొని ఒకరి మృతి
- డ్రైవర్‌కు తీవ్రగాయాలు

చౌటుప్పల్ : ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును డీసీఎం ఢీకొట్టడంతో ఒకరు దుర్మరణం చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామ శివారులో గురువారం అర్ధరాత్రి దాటాక జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు రూరల్ మండలంలోని పైడిచింతలపాడు గ్రామానికి చెందిన సిర్దు బాలకృష్ణ(42) తన డీసీఎంలో కూరగాయలను లోడు చేసుకుని హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్‌కు వెళ్తున్న సత్తుపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ లింగోజిగూడెం శివారులోని ఓ హోటల్ ఎదురుగా ప్రయాణికుల మూత్ర విసర్జనకు బస్సును రోడ్డు పక్కన ఆపాడు. ఆ సమయంలో డీసీఎం వాహనం ఆర్టీసీ బస్సు వెనుక వస్తోంది. ఎలాంటి ముందస్తు సంకేతాలు ఇవ్వకుండా బస్సును నిలపడంతో డీసీఎం డ్రైవర్ శ్రీనివాస్ వేగంగా వెళ్లి వెనుక నుంచి దానిని ఢీకొట్టాడు. దీంతో డీసీఎంలోని ఇద్దరు క్యాబిన్‌లో ఇరుకున్నారు. తీవ్రంగా గాయపడిన బాలకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న సీఐ మల్లికార్జున్‌రెడ్డి సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వెళ్లారు. క్యాబిన్ నుంచి ఇద్దరిని బయటకు తీశారు. గాయపడిన డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తమ్ముడు నాగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సులోని ప్రయాణికులు ఎవరూ గాయపడలేదు.

కేజీబీవీల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని కస్తూరిబా బాలికా విద్యాలయాల్లో 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్‌వీ రవి సాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. కస్తూర్బా బాలికా జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో బైపీసీ, ఎంపీసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో ప్రవేశానికి అర్హత గల బాలికలు ఈ నెల 27వ తేదీ నుంచి ఏప్రిల్ 20 వరకు ఏపీకేజీబీవీ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తులు సమర్పించాలని కోరారు. కుకునూరులోని కేజీబీవీలో బైపీసీలో 40 సీట్లు, కేజీబీవీ వేలేరులో ఎంపీసీలో 40 సీట్లు, కేజీబీవీ వేలేరుపాడులో హెచ్ఈసీలో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కేజీబీవీలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి ఉత్తీర్ణులైన అనాథలు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీలు, తల్లిదండ్రులు వలస వెళ్లిన బాలికలు, పేదరిక రేఖకు దిగువన ఉన్న బాలికలు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని, ఎంపికైన వారికి ఫోన్ ద్వారా మెసేజ్ పంపతామని వివరించారు. మెసేజ్లు అందిన వారు ఆయా కేజీబీవీలకు వెళ్లి ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు కేజీబీవీ ప్రత్యేక అధికారులను ఫోన్ నెంబర్లు 94419 15166, 83741 72109, 89199 84331 ద్వారా సంప్రదించాలని సూచించారు.

పాఠశాలల్లో ప్రవేశాలకు..

జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో 2023–24 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి, 7, 8, 9వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. ఈ పాఠశాలల్లో ప్రవేశాలకు ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 20వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. ఈ ప్రవేశాలకు డ్రాప్ అవుట్ బాలికలు, బడి బయట పిల్లలు, అనాధలు, పాక్షిక అనాధలు, పీహెచ్‌సీలు, ఎస్సీ, ఎస్టీ మైనారిటీలు, తల్లిదండ్రులు వలస వెళ్లిన బాలికలు, పేదరిక రేఖకు దిగువ గాల బాలికలు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు.

క్షయ నివారణకు సహకరించాలి

గణపవరం: క్షయవ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందిస్తే పూర్తిగా నివారించవచ్చని, ఈ విషయంలో నిర్లక్ష్యం తగదని గణపవరం పిహెచ్‌సి వైద్యాధికారి సంతోష్‌నాయుడు అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజిలో విద్యార్థులకు క్షయ వ్యాధి, నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వైస్‌ప్రిన్సిపల్ మధురాజు, సీహెచ్‌ఓ జాలాది విల్సన్, సోషల్ వర్క్ అధ్యాపకుడు టి.వెంకట్రావు, న్యాక్ కోఆర్డినేటర్ అక్కిరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేదలకు కంటి వైద్య పరీక్షలు



అర్జావారిగూడెంలో కంటి వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

భీమడోలు: వైఎస్సార్ కంటి వెలుగు పథకం పేదల కుటుంబాల్లో వెలుగులను నింపుతుందని జిల్లా చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు డాక్టర్ పాము మాన్‌సింగ్ అన్నారు. భీమడోలు పంచాయతీ పరిధిలోని అర్జావారిగూడెంలో శుక్రవారం వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన కంటి వైద్య నిపుణులు జె.వెంకటరెడ్డి ఆధ్వర్యంలో 50 మంది వృద్ధులకు కంటి పరీక్షలు చేశారు. 28 మందికి కళ్ల జోళ్ల అవసరమని గుర్తించారు. మరో 13 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు.కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు ఎం.శ్రీనివాసరావు, ఏఎన్‌ఎంలు వెంకటలక్ష్మీ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించడమే లక్ష్యం

భీమడోలు: ప్రతిభ ఉన్న విద్యార్థులకు కెనరా విద్యా జ్యోతి పథకం వరమని కెనరాబ్యాంకు భీమడోలు బ్రాంచ్ మేనేజర్ కంచుమూర్తి మునీష్‌కుమార్ అన్నారు. భీమడోలు కెనరాబ్యాంకు పరిధిలో శుక్రవారం కెనరా విద్యా జ్యోతి పథకం కింద ఎంపికైన భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలోని ఆరుగురు బాలికలకు నగదు ప్రోత్సాహకాలను అందించారు. ఒకొక్కరికి రూ.5వేల చొప్పున రూ.30వేల నగదును వారి వ్యక్తిగత ఖాతాల్లో జమ చేసి పాసు పుస్తకాలను అందజేశారు. హెచ్‌ఎం టి.పుష్పావతి, బోయిన రామ్‌ప్రకాష్, బగ్గే రాజీవ్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమ నిర్మాణానికి భూమి పూజ

ఉంగుటూరు: ఉంగుటూరు గ్రామంలో వృద్ధాశ్రమం నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. గ్రామానికి చెందిన కొండ్రెడ్డి సుబ్బారావు దంపతులు ఎకరం పొలం వృద్ధాశ్రమానికి అందించారు. అలాగే తాడేపల్లిగూడేనికి చెందిన ఓ దాత సుమారుగా కోటి రూపాయల విరాళం అందజేయడంతో గుణ్ణం బులబ్బాయి దంపతులు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలోదాత చింతలపూడి చిన వీర్రాజు, ఏఎంసీ మాజీ చైర్మెన్లు కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, పాతూరి విజయకుమార్ పాల్గొన్నారు.

జ్వరాలపై అప్రమత్తత అవసరం

గణపవరం: ప్రస్తుతం విస్తారంగా ఉన్న జ్వరాలపై ఆందోళన చెందవద్దని, అప్రమత్తతతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని తాడేపల్లిగూడెం డివిజన్ మలేరియా అధికారి వైవి లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం గణపవరం మండలం చిలకంపాడులో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఫ్రైడే డ్రైడేగా పాటించాల్సిన అంశాలపై ప్రజలకు వివరించారు.

దళిత క్రిస్టియన్లను ఎస్సీల్లో చేర్చాలని తీర్మానించడంపై హర్షం

దెందులూరు: దళిత క్రిస్టియన్లను ఎస్సీల్లో చేర్చాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం అసెంబ్లీలో తీర్మానం చేయించడంపై దళిత సంఘాలు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పళ్ళెం ప్రసాద్, దళిత సంఘాల జాతీయ కన్వీనర్ పొలిమేర హరికృష్ణ, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తనగాల శేఖర్, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్, మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కనికెళ్ళ మురళీకృష్ణ, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు గొల్లా కిరణ్, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిళ్ళెం శ్యాంతంబి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం దెందులూరులో దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ దళిత క్రిస్టియన్ల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. దళిత క్రిస్టియన్ల హక్కులు పరిరక్షించేందుకు సీఎం అసెంబ్లీలో తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని అన్నారు. అసెంబ్లీలో తీర్మానంపై దళిత సంఘాలు సీఎంకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ



కలపర్రు రహదారి వద్ద పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి

పెదపాడు: మండలంలోని వట్లూరు కలపర్రు రహదారిపై నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి పర్యవేక్షించారు. వట్లూరు కలపర్రు రహదారి, జాతీయ రహదారిపై పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ముఖ్యమంత్రి పర్యటన ఈ సందర్భంగా రహదాదారులన్నీ పరిశుభ్రం చేయాలని సూచించారు. శానిటేషన్ చేయించాలని పంచాయతీ కార్యదర్శి మేకా శ్రీనివాస్‌ను ఆదేశించారు. శానిటేషన్‌లో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

పోషణ పక్వాడపై అవగాహన

పెదపాడు: పిల్లలకు అనుబంధ ఆహారం అందించాలని పెదపాడు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బీ అపరంజి జ్యోత్స్న తెలిపారు. పెదపాడు మండలంలోని పాత ముప్పర్రు, వీరమ్మకుంట గ్రామాల్లో పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఏప్రిల్ 3 వరకు పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. స్వస్థ బాలకాస్పర్థ కార్యక్రమంలో భాగంగా బాల బాలికల పెరుగుదలపై, లోప పోషణగల పిల్లలను గుర్తించడం, పిల్లలకు అనుబంధ ఆహారం అందించడం, బాలామృతం వినియోగం, పిల్లల్లో పోషకాహార లోపం నివారణలపై అవగాహన కల్పించారు.